




“కొందరు ఉపాధ్యాయులు చేసే తప్పిదాలు మొత్తం ఆ వర్గానికే మచ్చ తెస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగం వచ్చే దాకా ఒక ఆరాటం.. వచ్చాక విద్యపై కాకుండా పదోన్నతులు, బదిలీల కోసం పోరాటం.. అందులోనూ వీలైనంత ఎక్కువ వేతనం పొందేందుకు అడ్డదారులు తొక్కడం.. ఇది ప్రస్తుతం కొంతమంది ఉపాధ్యాయులు వ్యవహరిస్తున్న తీరు. జిల్లాలో ఇటీవల జరిగిన బదిలీల్లో హెచ్‌ఆర్‌ఏ కోసం కొందరు ఉపాధ్యాయులు అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వస్తున్నాయి. వాటిపై విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.”

హెచ్‌ఆర్‌ఏ కోసం అడ్డదారులు

- స్పౌజ్ బదిలీల్లో నిబంధనలకు నీళ్లు
- ఇంటి అద్దె వర్తించే చోటికే స్పౌజ్ పాయింట్ల వినియోగం
- విచారణ చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

లింగాలఘణపురం, జూలై 9: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల పర్వంలో కొంతమంది ఉపాధ్యాయులు అక్రమాలకు తెరలేపారు. బదిలీల ప్రక్రియలో మానవీయ కోణంలో వాడుకోవాల్సిన స్పౌజ్‌పాయింట్లను దుర్వినియోగం చేశారు. హెచ్‌ఆర్‌ఏ కోసం అడ్డదారులు తొక్కారు. ఉపాధ్యాయుల బదిలీలు జూన్ 8న ప్రారంభం కాగా మొదట స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించారు. ఆ తర్వాత సాధారణ బదిలీలు కొనసాగాయి. కాగా భార్యాభర్తలు ఇద్దరు కూడా ఉపాధ్యాయులైతే వారికోసం ప్రభుత్వం స్పౌజ్ కింద ప్రత్యేకంగా 10 పాయింట్లను కేటాయించింది. దీంతో భార్యాభర్తలు వేర్వేరు ప్రాంతాల్లో కాకుండా ఒకే చోట లేదా ఒకే మండలంలోని సమీప ప్రాంతాల్లో పని చేసేలా వెసులుబాటు కల్పించింది. భార్యాభర్తల్లో ప్రతీ ఎనిమిదేళ్లకోసారి ఎవరికో ఒకరికి మాత్రమే అదనంగా ఇచ్చే పదిపాయింట్లు వర్తిస్తాయి. ఈలెక్కన భర్త పనిచేసే చోటుకు భార్య లేదా భార్య పనిచేసే చోటికి భర్త వెళ్లాలనుకుంటే స్పౌజ్‌పాయింట్లను వినియోగించుకోవచ్చు. ఒకవేళ అక్కడ ఖాళీలు లేకపోతే అదే మండలంలో సమీపంగా ఎక్కడ ఖాళీలు ఉంటే అక్కడికి బదిలీ చేసుకోవచ్చు. కానీ ఈ నిబంధనలను ఉపాధ్యాయులు తుంగలో తొక్కుతున్నారు. భర్త/భార్య పనిచేసే చోటుకు లేదా సమీప ప్రాంతానికి కూడా కాకుండా హెచ్‌ఆర్‌ఏ వర్తించే ప్రాంతాలకు బదిలీ చేసుకుని అక్రమాలకు పాల్పడ్డారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ప్రేక్షక పాత్రలో అధికారులు..

స్పౌజ్‌పాయింట్లను అడ్డగోలుగా వినియోగించుకోకుండా అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ప్రేక్షకపాత్రను పోషించినట్లు ఉపాధ్యాయ వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం మాణవీయ కోణంలో కల్పించిన 10 పాయింట్లను నిబంధనల ప్రకారమే వినియోగించుకుంటున్నారా.. లేక హెచ్‌ఆర్ ఏ కోసం వాడుకుంటున్నారా అనే కోణంలో విచారణ చేయాల్సి ఉంటుంది. కానీ జిల్లా విద్యాశాఖాధికారులు అవేమీ పట్టించుకోకుండా ఎక్కడికి ఎంచుకుంటే అక్కడికే బదిలీ చేసి చేతులు దులుపుకున్నారని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. హెచ్‌ఆర్‌ఏ కోసం స్పౌజ్ పాయింట్లను వాడుకొని పట్టణప్రాంతాల్లో అక్రమంగా బదిలీలను పొందిన ఉపాధ్యాయులను గుర్తించి వాళ్ల బదిలీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

మచ్చుకు కొందరు..

దేవరుప్పుల మండలంలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు నిబంధనల ప్రకారం తన భర్త పనిచేస్తున్న లింగాలఘణపురం మండలానికి బదిలీ అయ్యేందుకు స్పౌజ్ కింద 10 పాయింట్లను వినియోగించుకోవాలి. కానీ జనగామ మండలంలోని ఓ గ్రామానికి బదిలీ అయ్యేందుకు అక్రమంగా వాడుకున్నారు. అదేవిధంగా దేవరుప్పుల మండలంలో పనిచేస్తున్న మరో ఉపాధ్యాయురాలు తన భర్త పనిచేసే రఘునాథపల్లి మండలానికి వెళ్లాల్సి ఉండగా అక్రమంగా లింగాలఘణపురం మండలానికి బదిలీ చేసుకునేందుకు స్పౌజ్ పాయింట్లను వాడుకున్నారు. లింగాలఘణపురం మండలంలో పనిచేసే మరో ఉపాధ్యాయురాలు తన భర్త పనిచేసే జనగామ మండలానికి వెళ్లకుండా అక్కడ ఖాళీగా ఉన్నప్పటికీ లింగాలఘణపురం మండలాన్నే ఎంచుకున్నారు. లింగాలఘణపురం మండలంలో పనిచేసిన ఓ ఉపాధ్యాయురాలు జనగామ మండలంలోని ఓ గ్రామంలో తన భర్త పనిచేసే పాఠశాలలోనే ఖాళీగా ఉన్నప్పటికీ మరో గ్రామానికి బదిలీ చేసుకున్నారు. ఇవి కేవలం మచ్చుకు మాత్రమే. జిల్లాలో 41 మంది ఎస్‌జీటీలు, 26 మంది స్కూల్ అసిస్టెంట్లు స్పౌజ్ పాయింట్లను వాడుకుని బదిలీ అయ్యారు. ఇలాంటి అక్రమాలు జిల్లాలో ఇంకా అనేకం ఉండొచ్చని ఉపాధ్యాయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



తక్షణమే విచారణ చేపట్టాలి..
- బుర్ర రమేశ్, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు



స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేసి అక్రమం గా బదిలీ చేయించుకున్న ఉపాధ్యాయులను గుర్తించి విచారణ చేపట్టాలి. వారి బదిలీలను రద్దు చేసి లెఫ్ట్‌ఓవర్ వెకెన్సీలు భర్తీ చేయాలి. మానవీయ కోణంలో ప్రభుత్వం కేటాయించిన స్పౌజ్‌పాయింట్లను అడ్డదారిలో హెచ్‌ఆర్‌ఏ పొందేందుకు వాడుకున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.

డీఈవోకు ఫిర్యాదు చేశాం..
- నూకల ఎల్లారెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి



స్పౌజ్ పాయింట్లను అక్రమంగా వాడుకుని అడ్డగోలుగా బదిలీ చేసుకున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే డీఈవోకు ఫిర్యాదు చేశాం. అంతేగాకుండా సర్వీస్‌బుక్‌లో ఎంట్రీ చేయాలని కూడా పీఆర్‌టీయూ పక్షాన డీఈవోకు లెటర్ ఇచ్చాం. ఈ విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలి.

చర్యలు తీసుకుంటాం..
- రాము, జిల్లా విద్యాశాఖ అధికారి



స్పౌజ్ పాయింట్లను వాడుకుని బదిలీ అయిన వారి డేటాను పరిశీలిస్తున్నాం. స్పౌజ్‌పాయింట్లను దుర్వినియోగం చేసి వెబ్ ఆప్షన్లలో అక్రమాలకు పాల్పడ్డవారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. పూర్తిస్థాయి విచారణ అనంతరం స్పౌజ్‌పాయింట్లను దుర్వినియోగం చేసినవారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు సర్వీస్ బుక్‌లో కూడా నమోదు చేస్తాం.

విద్యాలయాల్లో ఎమ్మెల్యే కడియం తనిఖీలు

టెన్త్‌లో వందశాతం ఫలితాలు రావాలని ఆదేశం



ఖిలాషాపూర్ కేజీబీవీలో ఎస్‌వోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కడియం

రఘునాథపల్లి, జూలై 9: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు మోడల్ స్కూల్, కస్తూర్బా బాలికల విద్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం తనిఖీ చేశారు. ఖిలాషాపూర్ కేజీబీవీలో వంట గదిని పరిశీలించి కోడి గుడ్లు ఇంత చిన్నవి ఎలా తీసుకున్నారని స్పెషల్ ఆఫీసర్ సునీతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 గ్రాముల బరువు కలిగిన గుడ్లను తీసుకోవాలని ఆదేశించారు. కస్తూర్బా, మోడల్ స్కూళ్లలోని హాజరు రిజిస్టర్‌లో ఉపాధ్యాయులు ఉదయమే రెండు పూటలకు సంతకాలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రఘునాథపల్లి హైస్కూల్, వెల్ది మోడల్ స్కూళ్లలో విద్యార్థులు యూనిఫాం ఎందుకు ధరించలేదని ఉపాధ్యాయులను మందలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వివిధ సబ్జెక్టులపై వారికి గల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉన్నయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు బోజనం అందజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిహెచ్‌సీ వైద్యాధికారి డిప్యూటేషన్‌ను క్యాన్సిల్ చేయాలని డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి ఆదేశించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి కమలహాసన్‌కు సూచించారు. కార్యక్రమంలో డిఈవో కె.రాము, పీఆర్ డీఈ శ్రీనివాస్, తహసీల్దార్ యుగేందర్, ఎంపీడీవో శ్రీనివాసులు, నోడల్ అధికారి రఘునందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక..

గడ్డిమందు తాగిన ఇంటర్ విద్యార్థిని

- చికిత్సపొందుతూ మృతి
- నమిలిగొండలో విషాదం



రతీష (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 9: హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టం లేక పెద్దపూండ్ర రితీష (16) అనే ఇంటర్ విద్యార్థిని రెండు రోజుల క్రితం క్రిమిసంహారక మందు తాగింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నమిలిగొండ గ్రామానికి చెందిన పెద్దపూండ్ర శ్రీనివాస్ రెడ్డి-స్వాతి దంపతుల కుమార్తె రతీషను సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని కేజీబీవీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేర్పించారు. అక్కడే హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. కొన్ని రోజుల తరువాత తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాను హాస్టల్‌లో ఉండలేనని, ఇంటికి తీసుకువెళ్లాలని కోరింది. దీంతో వారు ఇంటికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఇంటివద్దే ఉంటే చదువులో వెనకబడిపోతావని, హాస్టల్‌కు వెళ్లి చదువుకోవాలని ఈ నెల 7వ తేదీన తల్లిదండ్రులు సూచించారు. అయితే తనను ఎలాగైనా మళ్లీ హాస్టల్‌కు పంపిస్తారనే బెంగతో వ్యవసాయబావి వద్దకు వెళ్లి గడ్డిమందు తాగింది. తల్లిదండ్రులు వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందింది. ఎస్సై నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే రాజయ్య పరామర్శ..

రతీష మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య నమిలిగొండకు వెళ్లి తల్లిదండ్రులను పరామర్శించారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, నాయకులు ఆకుల కుమార్, హరికృష్ణ, రంజిత్ తదితరులు నివాళి అర్పించారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



జనగామ చౌరస్తాలో జెండావిష్కరణ చేస్తున్న ఏబీవీపీ నాయకులు

జనగామ కల్చరల్, జూలై 9: ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లాలో జాతీయ విద్యార్థుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఏబీవీపీ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ విభాగ్ కన్వీనర్ అయిత నిఖిల్ పాల్గొని జనగామ చౌరస్తాలో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో జాతీయ భావజాలం కలిగిన అతి పెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ అన్నారు. జాతి పునర్‌వైభవం కోసం విద్యార్థి, యువతను సంఘటిత పరిచి వారిలో దేశభక్తి, దేశం పట్ల నిష్టను పెంపొందించడమే ఏబీవీపీ ధ్యేయమన్నారు. విద్యార్థి పరిషత్‌కు దత్తోపంత్ ఠెంగ్డడి, యశ్వంతరావు కేల్కర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి జనమంచి గౌరీశంకర్ వంటి మహనీయులు పునాది వేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుంటిపెల్లి కార్తీక్, హర్షవర్ధన్, మనోజ్, రాకేష్, సన్నీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్లిస్తారా.. చావమంటారా?

వాటర్ ట్యాంకు ఎక్కి డబుల్ ఇళ్ల ఆక్రమణదారుల నిరసన

- దూకి చస్తామని బెదిరింపు
- మూడు గంటలపాటు ఉత్కంఠ
- తహసీల్దార్ హామీతో దిగిన బాధితులు

వివరాలు 8వ పేజీలో





ట్యాంకు ఎక్కి నిరసన తెలుపుతున్న డబుల్‌బెడ్ రూం ఇళ్ల ఆక్రమణదారులు, కిందకు దిగాలని కోరుతున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

భార్యను చంపి భర్త ఆత్మహత్య

- కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులే కారణం
- ముగ్గురు పిల్లల్ని బావమరిది ఇంటికి పంపి దుశ్చర్య
- తల్లిదండ్రులను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో చిన్నారులు
- సోమవారం రాత్రి దారుణం.. మంగళవారం ఉదయం వెలుగులోకి
- కంటతడి పెట్టించిన చిన్నారుల రోదన
- వరంగల్ చెన్నారెడ్డినగర్‌లో విషాదం



చరణ్, స్వప్న(ఫైల్)

వివరాలు 7వ పేజీలో

ఏసీబీకి చిక్కిన కార్యదర్శి

- జీపీ బిల్లులు చెల్లించేందుకు రూ.50 వేలు డిమాండ్
- అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించిన బాధితుడు
- వల పన్ని పట్టుకున్న అధికారులు



కంచనపల్లి కార్యదర్శి పడిగె శివాజీని అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు

రఘునాథపల్లి, జూలై 9: నెల నెలా ఠంచన్‌గా వేలల్లో జీతం.. ఆపై అప్పుడప్పుడు దొరికే అమ్యామ్యాలు.. అయినా అతడిలో డబ్బుపై ఆశ చావలేదు. అత్యాశకుపోయి చివరికి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే.. రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామ మాజీ సర్పంచ్ గవ్వాని విజయ భర్త నాగేశ్వరరావు గతంలో జీపీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేశారు. వాటికి సంబంధించి రూ.1.53 లక్షలు జీపీ జనరల్ ఫండ్ నుంచి రావాల్సి ఉంది. అయితే వాటిని చెల్లించేందుకు కార్యదర్శి శివాజీని సంప్రదించగా, రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకాకుండా రూ.20 వేలు ఇచ్చేందుకు నాగేశ్వర్‌రావు ఒప్పుకున్నారు. ఆ తర్వాత డబ్బుల కోసం పలుమార్లు శివాజీ ఒత్తిడి చేశారు. దీంతో విసుగు చెందిన నాగేశ్వర్‌రావు వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. డీఎస్పీ సాంబయ్య సూచనల ప్రకారం నాగేశ్వరరావు మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న చెట్టు వద్దకు వచ్చారు. అక్కడ కార్యదర్శి శివాజీ రూ.20 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని శివాజీని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్లు శ్యాంసుందర్ రెడ్డి, సట్ల రాజు, ఎల్.రాజు తదితరులు పాల్గొన్నారు.

విసుగొచ్చి ఏసీబీని ఆశ్రయించా..
- గవ్వాని నాగేశ్వరరావు, బాధితుడు



చేసిన పనులకు బిల్లులు చెల్లించేందుకు గ్రామ కార్యదర్శి శివాజీ లంచం డిమాండ్ చేయడం.. ఈ విషయంలో పలుమార్లు ఒత్తిడి తేవడంతో భరించలేక ఏసీబీని ఆశ్రయించా. జూలై 2023 నుంచి చేసిన పనుల కోసం ఖర్చు చేసిన రూ.1.53 లక్షలు జీపీ జనరల్ ఫండ్ నుంచి ఇచ్చేందుకు కార్యదర్శి శివాజీ లంచం అడిగారు. ఏసీబీ అధికారులు అండగా ఉంటామని చెప్పడంతో పంచాయతీ కార్యదర్శిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించా.

లంచం అడిగితే సమాచారం ఇవ్వండి..

అధికారులు ఏదైన పని కోసం లంచం అడిగితే టోల్‌ఫ్రీ నెంబరు 1064కు సమాచారం ఇవ్వాలని వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య సూచించారు. లంచం తీసుకోవడంతో పాటు ఇవ్వడం కూడా నేరమని గుర్తించుకోవాలన్నారు. ఎవరైనా అధికారులు లంచం కోసం వేధిస్తే తమను సంప్రదించాలని కోరారు.

బాలికపై అత్యాచారయత్నం

రాజీపడితే డబ్బులు ఇప్పిస్తానని ఆశచూపిన మధ్యవర్తి

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

లింగాలఘణపురం, జూలై 9: అభం.. శుభం.. తెలియని 14 ఏళ్ల బాలికపై 37 ఏళ్ల యువకుడు డబ్బు ఆశజూపి అత్యాచార యత్నానికి ఒడిగట్టాడు. మూడు రోజుల క్రితం జనగామ జిల్లాలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లింగాలఘణపురం మండలంలోని ఓ బాలికకు అదే గ్రామానికి చెందిన పిట్టల ఉపేందర్ అనే యువకుడు రూ. 10వేలు ఇస్తానని డబ్బు ఆశజూపి లైంగిక దాడికి యత్నించాడు. వెంటనే భయంతో బాలిక ఇంట్లోకి వెళ్లి తలదాచుకుంది. అయినా వదిలిపెట్టని ఉపేందర్ తలుపులను బలంగా బాదాడు. దీంతో ఇంటి వెనుక ద్వారం నుంచి బాలిక పరుగులు తీసి పక్కనే ఉన్న మరొకరి ఇంట్లోకి వెళ్లి విషయం చెప్పింది. వారు బయటకు వచ్చేసరికి నిందితుడు పరారయ్యాడు.

ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నించగా అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి పెద్దమనిషి అవతారమెత్తి నిందితుడి నుంచి రూ.60వేలు ఇప్పిస్తానని, పోలీస్ స్టేషన్‌కు వెళ్లొద్దని వారించే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ లెక్కచేయకుండా బాధిత కుటుంబసభ్యులు మంగళవారం లింగాలఘణపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజు బీఎన్ఎస్ 75, పోక్సో యాక్టు 11 రెడ్‌విత్ 12 సెక్షన్లతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడేళ్ల క్రితం చెప్పుతో కొట్టిన యువతి

నిందితుడు ఉపేందర్ ఏడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన ఓ యువతిపై అత్యాచార యత్నం చేయడంతో గ్రామస్థులంతా ఏకమై గ్రామ పంచాయతీ వద్దకు పిలిపించి బాధిత యువతి చేత చెప్పుతో కొట్టించారు. అయినా బుద్ధిమార్చుకోని ఉపేందర్ ఇపుడు మళ్లీ బాలిక వెంట పడేందుకు ప్రయత్నించడం పట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడికి కఠిన శిక్షతో పాటుగా పెద్దమనిషిగా వ్యవహరించిన వ్యక్తిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్



నర్మెట మోడల్‌స్కూల్‌లో మొక్కకు నీళ్లు పోస్తున్న అడిషనల్ కలెక్టర్

నర్మెట, జూలై 9: మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. 75 వన మహోత్సవంలో భాగంగా మంగళవారం నర్మెట మోడల్ స్కూల్‌లో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వనమహోత్సవంలో విద్యార్థులు తమ కుటుంబ సభ్యులను భాగస్వాములను చేయాలని, ప్రతీ ఇంటికి ఆరు మొక్కలు నాటాలని, ప్రతీ విద్యార్థి రెండు మొక్కలను దత్తత తీసుకొని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో చంద్రశేఖర్, ఎంపీడీవో అరవింద్, ప్రిన్సిపాల్ శరత్‌కుమార్, ఏపీవో రమాదేవి, కార్యదర్శి శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి..

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూరు ఉన్నత పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను సత్వరం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ ఆదేశించారు. ఈ విషయమై గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదు చేయగా మంగళవారం ఆయన పాఠశాలను సందర్శించారు. ఎంపీడీవో రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రూప చైతన్యలకు పలు సూచనలు చేశారు. మిషన్ భగీరథ అధికారులు తక్షణం పాఠశాల సంప్‌కు కనెక్షన్ కలిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అప్పటి వరకు ట్యాంకర్ ద్వారా సంప్‌లో నీరు పోయాలన్నారు. పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న పనులను అమ్మ ఆదర్శ కమిటీలు సత్వరం పూర్తి చేయాలన్నారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటిన తరువాత, వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గంగం వాణి, ఏపీవో కృష్ణ, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలే లక్ష్యంగా..

కమిషనరేట్ పరిధిలో సీపీ ప్రత్యేక దృష్టి

ఠాణాల ఆకస్మిక తనిఖీలు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌పై ఫోకస్



హనుమకొండ స్టేషన్ తనిఖీ చేస్తున్న సీపీ(ఫైల్)



అర్ధరాత్రి సీపీ నగరంలో పెట్రోలింగ్ (ఫైల్)

వరంగల్ క్రైం, జూలై 9: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా సీపీ అంబర్ కిషోర్ ఝూ నడుబిగించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా నిర్వహించిన ఆయన స్టేషన్లలో పోలీస్ అధికారులు అందుబాటులో ఉండాలని గతంలోనే ఆదేశించారు. ఈ క్రమంలో తరచూ పోలీస్‌స్టేసన్లను తనిఖీ చేయడంతో పాటు కమిషనరేట్‌కు వచ్చిన బాధితుల సమస్యలను స్వయంగా తెలుసుకుంటున్నారు. అప్పటికప్పుడు పలు సమస్యలను పరిష్కరిస్తున్న ఆయన పోలీస్ అధికారులపై వచ్చిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని అటాచ్ చేయడం, స్టేషన్లు మార్చి పోస్టింగ్‌లు ఇస్తున్నారు. గంజాయి, బెల్టు షాపుల నియంత్రణకు చర్యలు చేపట్టారు. మొత్తంగా గతంలో కమిషనరేట్ పరిధిలో పనిచేసిన అనుభవంతో అంబర్ కిషోర్ ఝూ శాంతి భద్రతల పరిరక్షణకు పక్కా ప్రణాళికలతో వెళుతున్నారు.

ఆకస్మిక తనిఖీలతో హడల్

పలు స్టేషన్‌లలో ఎస్‌హెచ్‌వోలు అందుబాటులో ఉండటం లేదని, పిర్యాదులను పెండింగ్‌లో పెడుతున్నారని, బాధితుల పట్ల పోలీసుల ప్రవర్తన బాగోడం లేదన్న పిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఆయన కమిషనరేట్ పరిధిలోని స్టేషన్ల తనిఖీ చేపట్టి ఉద్యోగులను హడలెత్తించారు. ఆకస్మిక తనిఖీల్లో స్టేషన్ సిబ్బంది హాజరు, ఆరోజు వచ్చిన ఫిర్యాదులు, పెండింగ్ కేసుల వివరాలు తదితర విషయాలను పరిశీలిస్తున్నారు. అందుబాటులో ఉండని సిబ్బందికి వార్నింగ్ ఇచ్చారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు సీఐలు, ఎస్‌ఐలను ఇటీవల అటాచ్ చేసిన విషయం తెలిసిందే. అలాగే కమిషనరేట్ పరిధిలో అర్ధరాత్రి వేళ హటాత్తుగా రోడ్లపై పెట్రోలింగ్ చేస్తున్నారు. రెండు రోజుల క్రితం అంబర్ కిషోర్ ఝూ ట్రై సిటీస్‌లో అర్ధరాత్రి పెట్రోలింగ్ చేసి హడలెత్తించారు. వరంగల్ మండిబజార్ నుంచి వరంగల్ చౌరస్తా వరకు తనిఖీలు చేసారు. వ్యాపారస్తులు సకాలంలో షాపులు బంద్ చేయాలని సూచించారు. రోడ్లపై వాహనాల తనిఖీలు సైతం చేసిన అంబర్ కిషోర్ ఝూ అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించాలని అధికారులకు ఆదేశించారు. కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్‌కు ఆకస్మికంగా వెళ్లిన ఆయన రైల్వేస్టేషన్‌లో తరచూ సంచరించే అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించాలని సూచించారు. కమిషనర్ ఆకస్మిక తనిఖీలతో అధికారులు అప్రమత్తమయ్యారు. స్టేషన్లలో సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉన్నట్టు కనిపిస్తోంది.

ట్రాఫిక్‌పై ప్రత్యేక శ్రద్ధ

కాగా శాంతి భద్రతలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన అంబర్ కిషోర్ ట్రాఫిక్ నియంత్రణకు కూడా చర్యలు చేపట్టారు. నయీంనగర్ నాలా పనులు జరుగుతుండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయించడంతో పాటు ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులను నియమించారు. మర్కజీ పాఠశాల జంక్షన్ వద్ద డివైడర్లతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఫిర్యాదు అందడంతో స్వయంగా వెళ్లిన పోలీస్ కమిషనర్ వెంటనే డివైడర్‌ను తొలగించి సమస్యకు పరిష్కారం చూపి.. నూతన సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసారు. వాహనాల తనిఖీలు చేపట్టి పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించడం, వాహనాలు సీజ్ చేయాలని ట్రాఫిక్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

యుద్ధాలు మానవాళి మనుగడకు ప్రమాదకరం

ఎంసీపీఐ (యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న మద్దికాయల అశోక్

సుబేదారి, జూలై 9: యుద్ధాలు మానవాళి మనుగడకు ప్రమాదకరమని ఎంసీపీఐ (యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. ఎంసీపీఐ (యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ రెండు రోజుల సమావేశాలు హనుమకొండ సుబేదారిలోని రాఘవేంద్ర గార్డెన్స్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దారపు రమేష్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో తొలుత పాలస్తీనా, గాజాపై ఇజ్రాయిల్ దేశం సాగిస్తున్న నరమేధంలో, ఉక్రెయిన్, రష్యా దాడుల్లో మరణించిన వారికి, ఇటీవల వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన వారికి, ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు, నిరుద్యోగులకు, హత్రాస్ తొక్కిసలాటలో మరణించిన వారికి మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మద్దికాయల అశోక్ మాట్లాడుతూ ప్రపంచంలో శాంతి సౌభ్రాతృత్వం నెలకొల్పి శాంతియుత సహజీవనం కొనసాగించాల్సిన ప్రపంచ దేశాల్లో అమెరికా లాంటి సామ్రాజ్యవాద దేశాలు ఇతర దేశాల సార్వభౌమాధికారంలో జోక్యం చేసుకుంటున్నాయని అన్నారు. సమావేశంలో ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కుంభం సుకన్య, వస్కుల మట్టయ్య, వనం సుధాకర్, గోనె కుమారస్వామి, ఎన్‌రెడ్డి హంసారెడ్డి, మంద రవి, నాగార్జున పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పలయ్య

కాజీపేట, జూలై 9 : మున్సిపల్ కార్పొరేషన్‌లో విధినిర్వహణలో మృతి చెందిన పారిశుధ్య కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబీకులకు వెంటనే ఉద్యోగాలు కేటాయించాలని, కార్పొరేషన్ ప్రకటించిన రూ 1 లక్ష 50 వేలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య డిమాండ్ చేశారు. కాజీపేట మినీ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ సిబ్బంది, సీఐటీయూ నాయకులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టి.ఉప్పలయ్య మాట్లాడారు. మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తూ మరణించిన కార్మిక కుటుంబాలకు కార్పొరేషన్ తీవ్ర అన్యాయానికి గురుచేస్తుందన్నారు. మృతుల కుటుంబీకుల ఉద్యోగాలు ఇవ్వాల్సిన కార్పొరేషన్ కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. కార్మిక కుటుంబాలు కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

హనుమకొండ టౌన్, జూలై 9 : యువత మత్తుకు బానిస కావొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆచార్య రవి రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం సీపీ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలతో యువత భవి ష్యత్ నాశనం కావడమే కాకుండా ఎన్నో కుటుంబాలు ఛిద్రం అవుతున్నాయని, వాటికి దూరంగా ఉండి జీవితంలో ఉన్నతమైన స్థితికి చేరుకోవాలని సూచించారు.

జడ్పీలో బదిలీల ప్రక్రియ షురూ

హనుమకొండ సిటీ, జూలై 9 : జిల్లా పరిషత్‌లో బదిలీల ప్రక్రియ ఆరంభమైంది. అన్ని విభాగాల ఉద్యోగుల బదిలీ ప్రక్రియను అధికారికంగా చేపట్టారు. ఇందులో భాగంగా ఉద్యోగుల నుంచి ఆగస్టు 12 వరకు బదిలీ దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు. బదిలీలు జరుగనుండడంతో జడ్పీలో ఉద్యోగుల సందడి నెలకొంది.

ఎంజీఎంలో డీఎంహెచ్‌వో తనిఖీ

వరంగల్ మెడికల్, జూలై 9 : వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 6వ తేదీన జిల్లా కలెక్టర్ ఎంజీఎం ఆస్పత్రిని తనిఖీ చేసిన సందర్భంలో ఆదేశించిన విధంగా ఆస్పత్రిలో స్టార్టింగ్ ఓపీ, సీసీ కెమెరాలు ఏర్పాటు, ఓసీలో కుర్చీల ఏర్పాటు తదితరాలపై తనిఖీ చేశారు. అనంతరం ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి మాట్లాడిన అనంతరం జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేసినట్లు తెలిసింది.

కేయూ ఇంజనీరింగ్ డీన్ బదిలీ

కేయూ క్యాంపస్, జూలై 9: కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగం డీన్, కేయూ మహిళ, కో ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందంను వర్సిటీ కళాశాల నుంచి కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఈ మేరకు కేయూ ఉన్నతాధికారులు సదానందంను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. సదానందం బదిలీతో వర్సిటీ క్యాంపస్‌లోని రెండు ఇంజనీరింగ్ కళాశాలలకు తాత్కాలికంగా ఇద్దరూ అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఇన్‌చార్జిలుగా నియమించినట్లు తెలిసింది. అయితే ప్రొఫెసర్ సదానందం తన తమ్ముడికి ఆరోగ్యం బాగా లేదని బదిలీ తాత్కాలికంగా అపాలని వర్సిటీ ఉన్నతాధికారులను కలిసి విన్నవించినట్లు తెలిసింది. తక్షణమే వర్సిటీ కళాశాల నంచి రిలీవై కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో జాయిన్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తెలిసింది.

ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలి

యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేశ్‌నాయక్

హనుమకొండ టౌన్, జూలై 9 : ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేశ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం లష్కర్ బజార్‌లోని ప్రాక్టిసింగ్ ప్రైమరీ పాఠశాల, ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొం టున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజేశ్‌నాయక్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, స్కావెంజర్స్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతు న్నారన్నారు. జిల్లా అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధ్యాయనం చేసి పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. పూర్తి స్థాయి ఉపాధ్యాయులు లేక, ఇన్‌చార్జి హెచ్‌ఎంలతో విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందని వెంటనే సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ టౌన్ సెక్రెటరీ హరీశ్, జిల్లా నాయకులు రాజేశ్, రాకేశ్, శివ పాల్గొన్నారు.

భార్యను చంపి భర్త ఆత్మహత్య

- కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులే కారణం
- ముగ్గురు పిల్లల్ని బావమరిది ఇంటికి పంపి దుశ్చర్య
- తల్లిదండ్రులను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో చిన్నారులు
- సోమవారం రాత్రి దారుణం.. మంగళవారం ఉదయం వెలుగులోకి
- కంటతడి పెట్టించిన చిన్నారుల రోదన
- వరంగల్‌లోని చెన్నారెడ్డినగర్‌లో విషాదం


స్వప్న మృతదేహం


బిక్కుబిక్కుమంటూ ఉన్న ముగ్గురు పిల్లలు

ఖిలావరంగల్, జూలై 9: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు ఆ ఇంట్లో చిచ్చురేపాయి.. దీంతో జీవితంపై విరక్తి చెందిన భర్త భార్యను చంపి.. ఆ తర్వాత తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆ తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు చిన్నారులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ విషాదకర ఘటన వరంగల్ నగరంలోని 18వ డివిజన్ చెన్నారెడ్డి కాలనీలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

చెన్నారెడ్డికాలనీకి చెందిన మంద చరణ్ (45), మంద స్వప్న(40) దంపతులకు 18ఏళ్ల క్రితం వివాహం జరగ్గా, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు జన్మించారు. కుమారుడు అంధత్వంతో బాధపడుతుండగా చరణ్ భవన నిర్మాణ మేస్త్రీగా, స్వప్న కూరగాయల మార్కెట్‌లో కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కానీ కొద్దిరోజుల నుంచి చరణ్, స్వప్న దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. వాటికి ఆర్థిక ఇబ్బందులు కూడా తోడయ్యాయి. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం చరణ్ తన ముగ్గురు పిల్లలను వరంగల్‌లోని ఉర్సు ప్రాంతంలో నివాసం ఉండే తన బావమరిది ఇంట్లో దింపేసి వచ్చాడు. రాత్రి ఇంట్లో చరణ్, స్వప్న దంపతులు మాత్రమే ఉండగా రాత్రివేళ ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈక్రమంలో ఆగ్రహావేశానికి లోనైన చరణ్ రోకలి బండతో స్వప్నపై దాడి చేయడంతో తలకు బలమైన గాయమై స్వప్న మృతి చెందింది. ఆమె చనిపోయినట్టు నిర్ధారించుకున్నాక అప్పటికే తాను తెచ్చుకున్న పురుగుల మందును తాగి చరణ్ ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం తమ మామయ్య ఇంటి నుంచి ఆటోలో తిరిగి వచ్చిన ముగ్గురు పిల్లలు తల్లి రక్తపు మడుగులో, తండ్రి విగతజీవిగా కనిపించడంతో భయంతో బిగ్గరగా కేకలు వేస్తూ ఏడ్చారు. చిన్నారుల ఏడుపు విన్న స్థానికులు అక్కడికి చేరుకుని 100కి డయల్ చేసి సమాచారమివ్వగా మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు మార్చురీకి తరలించారు. మృతుడి పెద్ద కుమార్తె గ్రేసి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

దిక్కుతోచని స్థితిలో చిన్నారులు..

తల్లిదండ్రులు కోల్పోయిన ముగ్గురు పిల్లలు దిక్కుతోచని స్థితిలో మిగిలారు. పెద్దకుమార్తె గ్రేసీ ఏడో తరగతి వరకు చదువుని ఇంట్లోనే ఉంటోంది. చిన్న కుమార్తె మెర్సీ గుండెకు రంధ్రం ఉండటంతో ఆపరేషన్ చేయించే పరిస్థితి లేక తరచూ అనారోగ్యంతో బాధపడుతూ ఆమె కూడా స్కూల్‌కు వెళ్లడం లేదు. ఇక ఒక్కగానొక్క కుమారుడు శాలూమ్ కూడా అంధుడు కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. తమ కుటుంబ దీన స్థితికి తోడు ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడం, ఈ క్రమంలోనే భార్యాభర్తల మధ్య కలహాలు ప్రారంభం కావడంతో ఆత్మస్థైర్యం కోల్పోయి, జీవితంపై విరక్తితో చరణ్ ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటాడని బంధువులు, స్థానికులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

కంటతడిపెట్టించి చిన్నారుల రోదన

తమ మామయ్య ఇంటి నుంచి ఆనందంగా ఇంటికి వచ్చిన గ్రేసీ, మెర్సీ, శాలూమ్ ఇంటి తలుపు తీయగా తల్లిదండ్రులు చనిపోయి కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించడం అక్కడివారిని కంటతడి పెట్టించింది. ఇంటిముందు నిలబడి 'అమ్మా..నాన్నా..' అంటూ విలపించడం అక్కడి వారిని కలిచివేసింది.

ఔదార్యం చాటుకున్న పోలీసులు

కరీమాబాద్ : మిల్స్‌కాలనీ పోలీసులు ఔదార్యాన్ని చాటుకున్నారు. లేబర్‌కాలనీకి చెందిన మంద చరణ్-స్వప్న దంపతులు మృతిచెందడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ముగ్గురు చిన్నారులను చూసి చలించిపోయారు. ముఖ్యంగా శాలూమ్ అంధుడు కావడంతో స్పందించిన సీఐ మల్లయ్య రూ.10వేలు, ఎస్సైలు చందర్, శ్రీకాంత్ రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అలాగే 18వ డివిజన్ కార్పొరేటర్ వస్కుల బాబు, కాంగ్రెస్ నాయకుడు గడ్డమీది రాజేష్ రూ.5వేలు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్ రూ. 5వేలు అందించి మానవత్వంచాటుకున్నారు.

భక్తిశ్రద్ధలతో సీత్లా పండుగ

ప్రత్యేక పూజలు చేసిన మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్


మహబూబాబాద్ శివారు వీరారంతండా సీత్లాపండుగ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 9 : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం గిరిజనులు సీత్లా పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. యావత్ గిరిజన జాతిమొత్తం ఒకేరోజు పండుగను ఆనందోత్సవాల నడుమ నిర్వహించుకున్నారు. సీత్లాభవాని ఘాట్ వద్దకు గిరిజన మహిళలు సంప్రదాయబద్ధంగా నైవేద్యాలు (పాయసం)తో పాటు ప్రత్యేక వంటకాలు చేసుకుని సీత్లాభవాని అమ్మవారికి సమర్పించారు. ఆట, పాటలతో నృత్యాలు చేస్తూ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ప్రతీ గిరిజన తండాల్లో చిన్నాపెద్ద అనే తారతమ్యం లేకుండా ఈ వేడుకల్లో పాల్గొని, ప్రకృతిని ఆరాధిస్తూ కులదేవతను పూజించారు.

- మహబూబాబాద్ శివారు వీరారంతండాలో నిర్వహించిన వేడుకల్లో సీత్లాభవాని అమ్మవారికి స్థానిక శాసన సభ్యులు భూక్య మురళీనాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ భూక్య శ్రీను, డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్ పాల్గొన్నారు. గుండ్లబోడుతండాలో నిర్వహించిన వేడుకల్లో సేవాలాల్ సేనా రాష్ట్ర కోకన్వీనర్ వెంకన్ననాయక్, నాయకులు మోతీలాల్, బన్సీలాల్, శంకర్, బాలు,చంద్రు, లింగన్న, రవి, భద్రు, మాలు, సంజీవ, శ్రీను, రమేష్, మంగిలాల్, సరిత, మౌనికబాయి, మీనా, శారద, సునీత పాల్గొన్నారు. వినాయకతండాలో సీత్లాపండుగను పురస్కరించుకుని సీత్లాభవానికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బానోత్ శంకర్‌నాయక్, దారావత్ హంక్లా, బానోత్ సక్రాం, సురేష్, విజయ్, రమేష్, బిచ్యా, వస్రం పాల్గొన్నారు.


మహబూబాబాద్ వినాయక తండాలో సీత్లాభవానికి నైవేద్యం సమర్పించేందుకు వెళ్తున్న తండవాసులు

వివిధ మండలాల్లో..

మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని బోడ అమృతండ, సబ్‌స్టేషన్‌తండ, లోక్యతండ, జామతండ, అర్లగడ్డతండ, నేతావత్‌తండ, లూనావత్‌తండతో అన్ని గిరిజన గూడాల్లో సీత్లాపండగ వేడుకలు నిర్వహించారు.

- దంతాలపల్లి మండలంలోని తూర్పుతండ, దుబ్బతండ, రెక్యతండాలో గిరిజనులు సీత్లాభవాని పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అంజి, నాయకులు పాల్గొన్నారు.
- గూడూరు మండలం సీతానగరం శివారు రాళ్లవాగు దస్రు తండ, ఏపూరు గ్రామాల్లో సీత్లాభవాని వేడుకలు నిర్వహించారు. భూక్య మంగీలాల్, లక్ష్మణ్, వాంకుడోతు గోపినాథ్, వాంకుడోతు మోతీలాల్, శ్రీను, రమేష్, సురేష్, బిచ్చు, సర్దార్, బాబు, రాములు, వెంకటేష్, గోపిచంద్ పాల్గొన్నారు.
- బయ్యారం మండలంలోని అన్ని లంబాడ గిరిజన తండాల్లో, గూడాల్లో సీత్లాభవాని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తండా పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
- చిన్నగూడూరు మండలం మేగ్యతండాలో నిర్వహించిన వేడుకల్లో తండాపెద్ద బాదావత్ రెడ్డి, బాను, చంద్రు, సురేష్, జ్యోతిరాము, భూక్య వెంకన్న, చిరంజీవి, రాంబాబు, శంకర్, శివ, సాయిరాం, రవి, మల్లేశ్వర్, దస్రూ పాల్గొన్నారు.
- సీరోలు మండలం కాంపల్లి సక్రాంనాయక్‌తండాలో నిర్వహించిన వేడుకల్లో తేజావత్ రవీందర్, బిచ్చు, ఈశ్వర్, సేట్యా, బానోత్ వీరన్న, తేజావత్ వీరన్న, నరేష్, రాములు, సతీష్ పాల్గొన్నారు.
- పెద్దవంగర మండలంలో సీత్లాభవాని వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలలో పాల్గొని నైవేద్యాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పానుగోతు ప్రదీప్ ఎనాయక్, రఘులాల్‌నాయక్, రామచంద్రు, అమర్‌సింగ్, ధూమా, ప్రవీణ్, కల్యాణి, మంగమ్మ, మహిళలు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి టూ-డే క్రికెట్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 9 : వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వరంగల్‌లోని దేశాయిపేట సీకేఎం కళాశాల క్రీడా మైదానంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి టూ-డే క్రికెట్ లీగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబ ర్చిన క్రీడాకారులను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై రెండవ వారం నుంచి హైదరాబాద్ నగరంలో నిర్వహించనున్న టూ-డే క్రికెట్ లీగ్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. 25 సంవత్సరాల వయస్సు లోపు, 31 ఆగస్టు 1999 సంవత్సరం తర్వాత పుట్టిన ఔత్సాహిక క్రికెట్ క్రీడాకారులు అర్హులను తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈనెల 11న ఉదయం 10గం టలకు సీకేఎం కళాశాల క్రీడా మైదానంలో రిపోర్టు చేయాలని శ్రీనివాస్ వెల్లడించారు. మరిన్ని వివరాలకు-98495 70979 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

హనుమకొండ ఎఫ్ఏసీ డీఈవోగా వాసంతి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 9 : హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారిగా డి. వాసంతికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డీఈవోగా పనిచేస్తున్న డాక్టర్ ఎండీ. అబ్దుల్ హై అనారోగ్యానికి గురికావడంతో ఆయన రెండు నెలల పాటు సెలవు పెట్టారు. దీంతో వరంగల్ ఎఫ్ఏసీ డీఈవోగా పనిచేస్తున్న డి.వాసంతికి హనుమకొండ బాధ్యతలు అప్పగించారు.

అడవి బిడ్డలకు అక్షరాభ్యాసం

- గొత్తికోయగూడెంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు
- ప్రారంభించిన మంత్రి సీతక్క
- చిన్నారి తులసి కోరిక మేరకే నిర్మించామని వెల్లడి

మేడారం, జూలై 9: మారుమూల అటవీ ప్రాంతంలో.. గొత్తికోయ బిడ్డలు చదువుకొనేలా మంత్రి సీతక్క చూపిన చొరవ చూపడంతో సర్కారు పాఠశాల ప్రారంభమైంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం నార్లాపూర్ పంచాయతీ పరిధి గొత్తికోయగూడెమైన తక్కెళ్లపల్లి గూడేనికి చెందిన చిన్నారి పూణెం తులసి ఆ కార్యక్రమంలో నాటిక ప్రదర్శన ఇవ్వగా.. ఆమె ప్రదర్శనను మెచ్చిన మంత్రి సీతక్క 'నీకేం కావాలి తల్లీ' అని ఆ చిన్నారిని సీతక్క అడగ్గా 'మా గ్రామానికి పాఠశాల కావాలి' అని ఆ చిన్నారి టక్కున సమాధానం ఇచ్చింది. అందుకు మంత్రి స్పందించి పాఠశాల నిర్మాణానికి ముందడుగు వేశారు. దాతల ఆర్థిక సహకారం, పోలీసు శాఖ పర్యవేక్షణలో నిర్మితమైన ఆ పాఠశాల భవనం మంత్రి సీతక్క చేతుల మీదుగా మంగళవారం ప్రారంభమైంది. ములుగు ఎస్పీ శబరీశ్, ఓఎస్డీ మహేష్ గీతెతో కలిసి మంత్రి తాక్కెళ్లగూడెం గొత్తికోయగుంపులో పాఠశాల భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారి పూణెం తులసి కోరిక మేరకే గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. నీకేం కావాలని అడగ్గానే తమ గ్రామానికి పాఠశాల కావాలని ఆ చిన్నారి చెప్పడం తననెంతో ప్రభావితం చేసిందని మంత్రి ఆనందాన్ని వ్యక్తం చేశారు. గూడెంలో పాఠశాలను నిర్మించాల్సిన ఆవశ్యతకను ఎస్పీ శబరీశ్‌కు వివరించానన్నారు. అటవీ శాఖ అనుమతులతో 15 రోజుల్లో రూ.8.5లక్షలతో భవన నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. దీనికి డాక్టర్ తరుణ్‌రెడ్డి రూ.1.50లక్షలు ఆర్థిక సాయం అందించగా రూ.3లక్షలు ఎస్పీ సమకూర్చారని, కలెక్టర్ నిధుల నుంచి రూ.4లక్షలు కేటాయించారని వివరించారు. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డితో పాటుగా శ్రమించిన తాడ్వాయి పోలీసు బృందాన్ని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. ఎస్పీ శబరీశ్ మాట్లాడుతూ 31కుటుంబాలు ఉన్న తక్కెళ్లగూడెం ప్రజల జీవితాల్లో అక్షర వెలుగులు నింపడానికి ఈ పాఠశాల దోహదపడుతుందన్నారు. పిల్లలే కాకుండా పెద్దలు కూడా ఖాళీ సమయంలో అక్షరాభ్యాసం చేయాలని సూచిం చారు. అలాగే గూడెం వాసులకు హనుమకొండలోని చక్రవర్తి హాస్పిటల్‌లో ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్టు తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క చేతుల మీదు గా గొత్తికోయ పిల్లలకు పుస్తకాలు, స్కూల్ యూనిఫాం పంపిణీ చేశారు.


స్కూల్ భవనం ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

గూడెంలో మంత్రి పుట్టిన రోజు వేడుకలు

ఎస్పీ శబరీశ్ ఆధ్వర్యంలో తక్కెళ్లగూడెంలో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు జరిగాయి. గూడెం వాసులతో కలిసి కేక్ కట్ చేసిన సీతక్క పిల్లలకు, పెద్దలకు, పోలీసులకు, కార్యకర్తలకు పంచారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, సీఐ జి.రవీందర్, పోలీసులు సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

- ఇల్లు అమ్మినా తీరని ఆర్థిక ఇబ్బందులు
- భీమదేవరపల్లి మండలం వంగరలో విషాదం


సునీత మృతదేహం

భీమదేవరపల్లి, జూలై 9 : వారికి ఎలాంటి వ్యవసాయ భూమి లేదు. భార్యభర్త ఇద్దరూ కష్టపడి పనిచేసుకునేవారు. ఈ క్రమంలోనే ఆ మహిళ కౌలు రైతుగా మారింది. నాలుగెకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని భర్తతో కలిసి పంటలు సాగు చేసింది. అలాగే తన కూతురు వివాహం కూడా చేసింది. కానీ గతేడాది వర్షాలు కురవకపోవడంతో పత్తి, వరి పంటలు ఎండిపోయి ఆ దంపతులు తీవ్ర నష్టాల పాలయ్యారు. అటు పంట పెట్టుబడులు.. ఇటు కూతరు వివాహం కోసం చేసిన అప్పులు మొత్తం రూ. 15లక్షలయ్యాయి. చివరకు ఆ అప్పు తీర్చే దారిలేక తమ సొంత ఇంటిని అమ్మారు. అయినా ఆర్థిక సమస్యకు పరిష్కారం దొరకలేదు. దీంతో దంపతులిద్దరూ తీవ్ర మనోవేదనలో ఉన్నారు. ఈ క్రమంలోనే ధైర్యం చెడిన ఆ ఇల్లాలు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద సంఘటన భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో జరిగింది. వంగర ఎస్ఐ నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం వంగర గ్రామానికి చెందిన ఏలూరి సునీత(40), శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. ఎలాంటి వ్యవసాయ భూమి లేకపోవడంతో వారు నాలుగెకరాల భూమిని కౌలు తీసుకొని గతేడాది పత్తి, వరి పంటలు వేశారు. కానీ తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంటలు పూర్తిగా ఎండిపోయాయి. కళ్ల ముందే పంటలు ఎండిపోవడంతో భూమి యజమానికి చెల్లించాల్సిన కౌలు డబ్బులు, పెట్టుబడిగా తెచ్చిన అప్పులు మరింత భారంగా మారాయి. అలాగే అదే ఏడాది కూతురు వివాహం కూడా చేయడంతో వారు చేసిన అప్పులు రూ.15లక్షలయ్యాయి. ఇటీవల అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు పెరగడంతో గత్యంతరం లేక తాము నివసిస్తున్న ఇంటిని రూ.7లక్షలకు విక్రయించి అప్పులు చెల్లించగా.. మరో రూ.8లక్షలు తీర్చే దారిలేకుండా పోయింది. ఇదే మనోవేదనలో భార్యభర్తలిద్దరూ ఉండగా మంగళవారం తెల్లవారు జామున సునీత ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగింది. ఉదయం సమయంలో నిద్రలేచిన భర్త శ్రీనివాస్‌రెడ్డి సునీత అపస్మారక స్థితిలో ఉండటాన్ని చూసి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. సునీత మృతితో వంగరలో విషాద ఛాయలు అలముకోగా.. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. భర్త శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

సందడిగా జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఎంపికలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాజరైన 40 మంది క్రీడాకారులు


జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో స్విమ్మింగ్ అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 9 : వరంగల్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని డీఎస్ఏ స్విమ్మింగ్‌ఫూల్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు మంగళవారం సందడిగా ప్రారంభమయ్యాయి. సబ్‌జూనియర్స్, జూనియర్స్ బాలబాలికల విభాగంలో నిర్వహించిన పోటీలలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 40మంది బాలబాలికలు పాల్గొనడం జరిగిందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వామిచరణ్ తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో ఫ్రీస్టైల్, బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్ బటర్‌ఫ్లై, ఇండివిజువల్ మిడ్‌లే విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 13, 14 తేదీలలో సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ స్విమ్మింగ్‌ఫూల్‌లో నిర్వహించనున్న అంతర్ రాష్ట్రాల సబ్‌జూ నియర్స్, జూనియర్స్ బాలబాలికల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా చైర్మన్ సునీల్‌రెడ్డి, అధ్యక్షుడు కందు కూరి రాజేంద్రప్రసాద్, సభ్యులు కందుకూరి సంజయ్‌కృష్ణ, డీఎస్ఏ స్విమ్మింగ్ కోచ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు అడవిలో నెమలి సంచారం


గూడూరు అటవీప్రాంతంలో సంచరిస్తున్న నెమలి

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), జూలై 9 : గూడూరు శివారు చంద్రుగూడెం అటవీ ప్రాంతంలో మంగళవారం జాతీయపక్షి నెమలి సంచారం కన్పించింది. అటవీ శాఖ అధికారుల ర క్షణ చర్యల్లో భాగంగా వన్యప్రాణులు, పక్షులు సంచారం ఎక్కువగా కన్పిస్తోంది. తాజాగా చంద్రుగూడెం అటవీప్రాంతంలో నెమలి కన్పించడంతో చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.

ప్రతి ఇంటా.. గోరింట

- ఆషాఢంలో మహిళల ఆభరణం
- పలు వ్యాధులకు చక్కని ఔషధం



బచ్చన్నపేట, జూలై 9: ఆషాడం అనగానే మహిళలకు గుర్తుకువచ్చేది గోరింటాకు. చిన్నారుల నుంచి వయస్సు పైబడిన మహిళలు సైతం గోరింటాకును పెట్టుకోవటానికి ఇష్టపడతారు. వివాహాలు, శుభకార్యాలు రాగానే తొలుత గోరింటాకుకు ప్రాధాన్యతనిస్తారు. ఆషాఢ మాసంలో లేత గోరింటాకులను మెత్తగా రుబ్బి పెట్టుకుంటే బాగా పండుతుందంటారు. గోరింటాకు శాస్త్రీయ నామం లోసోనియా ఇన్నెర్‌మిస్. దీనికి అరబిక్ పేరు హెన్నా. మెహందీగా ఇది సుప్రసిద్ధం. గోరింటాకు వేల ఏళ్ల నాటి నుంచి వాడుకలో ఉందని చెబుతారు. ఇది అలంకరణ కోసమే కాకుండా ఔషధంగా కూడా పనికొస్తుందని నమ్ముతారు. ఆకులను మెత్తగా రుబ్బి ఇందులో కాస్త చింతపండు, పెరుగు కలుపుతారు. అలా తయారైన గోరింటాకు చూర్ణాన్ని చేతులు, పాదాలపైనా మహిళలు పలు రకాల డిజైన్లలో పెట్టుకుంటారు. ఈ గోరింటాకులో హన్నోటిక్ ఆమ్లం ఉంటుంది. ఇది చర్మంలోని కొల్లాజల్ అనే రసాయనంతోనూ, వేలిగోళ్లు, వెంట్రుకల్లో ఉండే కెరాటిన్‌తో బంధం ఏర్పర్చుకోవడంతో ఎర్రగా పండుతుంది. గోరింటాకు గోరింటాకు పువ్వు, ఆకులు, వేర్లు, విత్తనాలను చూర్ణంగా చేసుకుని పెట్టుకోవడం ద్వారా పలు రకాల చర్మ వ్యాధులు, వెంట్రుకలు రాలకుండా ఉండేందుకు, చుండ్రు తొలగించేందుకు, కేశాలంకరణకు ఔషధంగా ఉపయోగిస్తారు.

ఆయుర్వేద, ప్రకృతి వైద్య నిపుణులు చెప్పే ఉపయోగాల్లో కొన్ని..



గోరింటాకు అలంకరణకు, అందానికి మాత్రమే కాకుండా ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతారు. జ్వరంతో బాధపడుతున్న వ్యక్తి శరీరానికి గోరంటాకు పూయటం వల్ల శరీర ఉష్ణోగ్రత అదుపులోకి వస్తుందని, బాగా నూరిన గోరింటాకును నొప్పిగా ఉన్న కీళ్లపై పెట్టి కట్టు కట్టడం ద్వారా అదుపు చేయవచ్చని చెబుతున్నారు. గోరింటాకును వెనిగర్, నిమ్మరసంతో కలిపిన మిశ్రమాన్ని అనారోగ్యం ద్వారా వచ్చే పాదాల మంటలను అరికట్టేందుకు వాడుతారని, నోటిపూతతో బాధపడేవారు గోరింటాకు కషాయం నోటిలో వేసుకుని పుక్కిలిస్తే తగిన ఫలితం కనిపిస్తుందంటున్నారు. ఇక గోరింటాకు యాంటీబయోటిక్ లక్షణాలను కలిగి ఉండటం మూలంగా కాళ్లకు, చేతులకు పెట్టుకోవడం ద్వారా క్రిములు దరిచేరకుండా ఉంటాయని, దీని నుంచి ఉత్పత్తయ్యే లాసోస్ అనే రంగు పదార్థం సూక్ష్మజీవులను నశింపజేస్తుందని పేర్కొంటున్నారు. గోరింటాకు పువ్వులు సుఖనిద్రను పెంచి తలనొప్పిని దూరం చేయడానికి ఉపయోగపడతాయని, గోరింట చెట్టు బెరడు పచ్చకామెర్లకు, కాలేయ వాపు తీవ్రత తగ్గించడానికి వినియోగిస్తారని, లేత గోరింట పండ్ల నుంచి తయారు చేసిన చూర్ణం శరీరంపై వచ్చే దురదను అదుపు చేస్తుందని చెబుతున్నారు.



వినూత్న వైద్య సేవలు

- ఏజెన్సీ ప్రాంత గిరిజనుల కోసం కంటైనర్ ఆస్పత్రి
- నేటినుంచి అందుబాటులోకి..

తాడ్వాయి, జూలై 9: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని పోసాపూర్‌లో కంటైనర్ ఆస్పత్రి ఏర్పాటైంది. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు అత్యాధునికంగా వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ములుగు కలెక్టర్ టి.ఎస్.దివాకర, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య ఆధ్వర్యంలో దీనిని అందుబాటులోకి తెస్తున్నారు. వర్షాకాలంలో తాడ్వాయి మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో గల బందాల, పోసాపూర్, అల్లిగూడెం, నర్సాపూర్, బొల్లెపల్లి, తదితర గ్రామాలకు వరదల కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈప్రాంత గిరిజనులకు వైద్యసేవలకు సైతం ఆటంకం కలుగుతోంది. గతంలో పలువురు అనారోగ్యాలతో మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. వర్షాకాలంలో వైద్యబృందం ఆ గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. ఈక్రమంలో ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఒక కంటైనర్‌లో నాలుగు బెడ్లు ఏర్పాటు చేసి వైద్యసేవలతోపాటు సుఖ ప్రసవాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. అత్యవసర చికిత్సలు అందించేందుకు వైద్యబృందం నాలుగు నెలలపాటు సిద్ధంగా ఉంటారు. ఈ సీజన్‌లో వివిధరకాల రోగాలకు రక్తనమూనాలు సేకరించి రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తారు. ఈ అదనపు ఆస్పత్రిలో ఒక వైద్యాధికారితోపాటు ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎం, స్టాఫ్‌నర్సు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉంటారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో కంటైనర్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని సుమారు రూ.7లక్షల వ్యయంతో హైదరాబాద్‌లో రూపొందించి పోసాపూర్‌కు తరలించి సిద్ధంగా ఉంచారు. దీనిపై ఏజెన్సీ ప్రాంత గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




పోసాపూర్‌లో ఏర్పాటుచేసిన కంటైనర్ ఆస్పత్రి, ఆస్పత్రిలో బెడ్లను ఏర్పాటు చేసిన సిబ్బంది

ఇళ్లిస్తారా.. చావమంటారా?

వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలిపిన డబుల్ ఇళ్ల ఆక్రమణదారులు

దేవరుప్పుల, జూలై 9: ఇళ్లు ఇప్పిస్తారా.. లేక చావమంటారా.. అంటూ ఇళ్ల ఆక్రమణదారులు అధికారులను బెదిరించారు. వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే వచ్చి హామీ ఇచ్చేవరకు దిగబోమని భీష్మించారు. లేదంటే దూకి చస్తామని హెచ్చరించారు. చివరికి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో దిగివచ్చారు. జనగామ జిల్లాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. దేవరుప్పుల మండలం కొత్తవాడలో గత ప్రభుత్వం దళితులకోసం 20 డబుల్‌బెడ్‌రూం ఇళ్లను నిర్మించింది. అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే వాటిని కొంత మంది ఆక్రమించుకొని 8నెలలుగా నివాసముంటున్నారు. అయితే గ్రామసభలో తీర్మానించకముందే ఇండ్లను ఎలా ఆక్రమించుకుంటారని, వెంటనే ఖాళీ చేయాలని పది రోజుల క్రితం హౌసింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు వెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. మళ్లీ ఐదురోజుల క్రితం మరోసారి వెళ్లి ఇళ్లు ఖాళీ చేయాలని, లేదంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం వారు కస్తూర్బా హాస్టల్ ఆవరణలో ఉన్న ట్యాంకుపైకి ఎక్కారు. ఉప్పుల నరేష్ తన భార్య ఇద్దరు పిల్లలతో పాటు జోగు నరేష్, చింత కిష్టయ్య, చింత సోమయ్య తదితరులు సుమారు 3గంటలపాటు ట్యాంకుపైనే ఉండి నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై చెన్నకేశవులు, డీటీ నవీన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ట్యాంకు వద్దకు చేరుకున్నారు. వారిని కిందకు దిగాల్సిందిగా కోరారు. అయినా వారు వినిపించుకోలేదు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి వచ్చి ఇళ్లు తమకే కేటాయిస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ట్యాంకుపై నుంచి దూకి చస్తామని హెచ్చరించారు. కలెక్టర్‌తో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని తహసీల్దార్, సీఐ మహేందర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో కిందకు దిగారు.

అప్పిరెడ్డిపల్లెకు బస్సు ప్రారంభం

దేవరుప్పుల, జూలై 9: మండలంలోని అప్పిరెడ్డిపల్లె నుంచి జనగామకు మంగళవారం బస్సు సర్వీసులు జనగామ డిపో మేనేజర్ వెల్దండి జోత్స్న ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య హాజరయ్యారు. అప్పిరెడ్డిపల్లెకు బస్సు వేయాలని సమ్మయ్యను గ్రామస్థులు కోరగా డిపో మేనేజర్‌తో మాట్లాడి సౌకర్యం కల్పించారు. ఉదయం, సాయంత్రం గ్రామానికి బస్సు వస్తుందని, ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు. కార్యక్రమంలో కంట్రోలర్ బాలశౌరిరెడ్డి, మాజీ సర్పంచ్ సుధాకర్, సోమరాజు, యాదయ్య, యాకయ్య, నవీన్‌రెడ్డి, అశోక్, శ్రీను, కోమురయ్య, మహేందర్ పాల్గొన్నారు.

ముగిసిన ఎప్‌సెట్-24 సర్టిఫికెట్ల వెరిఫికేషన్

జనగామ కల్చరల్, జూలై 9: ఏప్‌సెట్-24 సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ ముగిసిందని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించిన వెరిఫికేషన్‌లో 1110 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. వెరిఫికేషన్‌లో ఎస్.రాజేష్‌కుమార్, రవీందర్, వై.గణేష్, టి.కరుణాకర్, సీహెచ్.మోహన్, జి.కల్పన, ఎస్.ప్రసన్నలక్ష్మి, వై.కళావతి, సుజాత పాల్గొన్నారు.

జనగామలో దొంగల బీభత్సం

జనగామ రూరల్, జూలై 9: జనగామలో దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. రోజు రోజుకూ వారి అరాచకాలు పెరిగిపోతున్నాయి. కొన్ని రోజులుగా తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన బాగర్తి కొమురయ్య జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్న పెద్ద కుమారుడు మొట్టురాం ఇంటికి ఆదివారం వెళ్లాడు. సోమవారం వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూ.90వేల విలువగల బంగారంతో పాటు రు.60 వేల నగదు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేశారు. ఎస్సై తిరుపతి సంఘటన స్థలానికి చేరుకొని చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.




దేశాయితండాలో సీత్లాభవాని అమ్మవారికి నైవేద్యం తీసుకెళ్తున్న గిరిజన మహిళలు, కడగుట్ట తండాలో సీత్లా పండుగలో పాల్గొన్న తండావాసులు

తండాల్లో ఘనంగా సీత్లాభవాని వేడుకలు

చిలుపూర్, జూలై 9: మండలంలోని దేశాయితండాలో సీత్లాభవాని వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం దాటోడి (గొడ్లదాటుడు) పర్వదినాన్ని పురస్కరించుకుని గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి గ్రామ సమీపంలో ఉన్న సీత్లాదేవి ఆలయానికి నృత్యప్రదర్శనగా వెళ్లారు. సీత్లాదేవి అమ్మవారికి మొక్కులు చెల్లించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా పూజారి కిషన్‌నాయక్, మాజీ ఎంపీటీసీ యాదగిరి నాయక్ మాట్లాడుతూ తమ ఆరాధ్య దైవం సీత్లాదేవికి యేటా ఆషాఢమాసంలో ప్రత్యేక పూజలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఎన్నకూస రాజు, తండావాసులు బికునాయక్, హేమానాయక్, లాలూ, స్వామినాయక్, భూక్య వెంకట్, కాలూరాం, కిషన్, రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల: మండలంలోని కడగుట్ట తండాలో మంగళవారం కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు డి.సురేష్‌నాయక్ ఆధ్వర్యంలో సీత్లా పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని పూజించడమే సీత్లా పండుగ ఉద్దేశం అన్నారు. యేటా ఆషాఢమాసంలో లంబాడీలు ప్రత్యేకంగా నిర్వహించే పండుగకు ఆయా తండా పెద్దమనిషే పూజారిగా వ్యవహరిస్తారని తెలిపారు. చిన్నాపెద్దా, పాడిపంటా, పశు పక్ష్యాదులు చల్లగా ఉండాలని సీత్లాదేవికి మొక్కులు చెల్లిస్తామని అన్నారు. కార్యక్రమంలో శ్రీను, మోహన్, తుకారాం, సతీష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి

● విద్యాశాఖ జిల్లా మానిటరింగ్ అధికారి శ్రీనివాస్



జఫర్‌గడ్‌లో మాట్లాడుతున్న ఏఎంవో శ్రీనివాస్

జఫర్‌గడ్, జూలై 9: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యాశాఖ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జఫర్‌గడ్ జడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏఎంవో శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ విద్యా సంవత్సర వార్షిక ప్రణాళికలను తయారు చేసుకుని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. జిల్లా బాలికా శిశు సంక్షేమాధికారి గౌసియా బేగం మాట్లాడుతూ బాలికలకు మంచి, చెడు విషయాలపై మహిళా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. విద్యా బోధన, పాఠ్యాంశాలు, బాలికా సంక్షేమం, ప్రణాళికల రూపకల్పన వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో నోడల్ అధికారి ఎండి.పర్వేజ్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.పద్మ, డి.షరోన్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

చిలుపూర్: ప్రస్తుత విద్యా సంవత్సరంలో పక్కా ప్రణాళికలు రూపొందించుకుని ప్రైవేటుకు దీటుగా ఫలితాలు సాధించాలని ఏఎంవో శ్రీనివాస్ సూచించారు. మంగళవారం చిలుపూర్ విద్యా వనరుల కేంద్రంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటుకు దీటుగా పాఠశాలల్లో అన్ని వనరులను సమకూరుస్తోందని, స్టేషనరీ, నోట్‌బుక్స్‌ను సైతం ఉచితంగా అందిస్తోందని అన్నారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో గౌసియాబేగం, నోడల్ అధికారి గోవర్ధన్, హెచ్‌ఎంలు కేతిరి నర్సింహారెడ్డి, దారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: ప్రతీ తరగతిలో వెనకబడి ఉన్న విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచి ముందు వరుసలో నిలపేలా ఉపాధ్యాయులు తరగతి, పాఠశాల వార్షిక ప్రణాళికలు రూపొందించాలని ఏఎంవో శ్రీనివాస్ సూచించారు. మంగళవారం స్టేషన్ ఘన్‌పూర్ ఎంఆర్‌సీలో పీఎస్, యూపీఎస్ హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణిత పరిక్రియలు లాంటి కనీస సామర్థ్యాలు వచ్చేలా బోధన చేయాలన్నారు. చదువుతో పాటు మానసిక, శారీరక వికాసానికి క్రీడా, సాంస్కృతిక, కృత్య పోటీల్లో రాణించేలా కృషి చేయాలన్నారు. కలెక్టర్, డీఈవో సూచనల మేరకు విద్యారంగంలో జిల్లా రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలిచేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలన్నారు. సమావేశానికి ఎంఎన్‌వో జి. కొమురయ్య అధ్యక్షత వహించగా సీనియర్ జీహెచ్‌ఎం బి.రఘుజీ, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఎం.సంపత్, కె.రమేశ్, సీఆర్‌పీలు గిరి, సునిత, వెంకటేశ్వర్లు, లవన్, జ్యోతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామి ఆలయ భూములను కాపాడాలి



తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న వీహెచ్‌పీఎస్, భజరంగ్‌దళ్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 9: రెవెన్యూ అధికారులు ప్రైవేట్ వ్యక్తులతో కుమ్మక్కై డివిజన్ కేంద్రంలోని కోట్లాది రూపాయల విలువచేసే తిరుమలనాథ స్వామి ఆలయ భూమి పోజిషన్‌ను, హద్దులను మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని వీహెచ్‌పీఎస్, భజరంగ్ దళ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు తహసీల్దార్ వెంకటేశ్వర్లను కలిసి ఆలయభూముల అన్యాక్రాంతం విషయమై అధికారులు తప్పుడు ప్రకటనలు ఇవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయభూమిని కాపాడేందుకు పదేళ్లుగా అనేక మార్లు ధర్నాలు, నిరసనలు చేసి పరిరక్షిస్తున్న తరుణంలో హద్దులు మార్చే కుట్రలు చేయడం సరికాదన్నారు. కొన్ని నెలల క్రితం ఆలయ భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తే అధికారులు అక్కడికి వచ్చి వాటిని తొలగించి ఇప్పుడు సదరు భూమి ఆలయానికి కాదని, హద్దులు వేరే ఉన్నాయని ప్రకటనలు చేయడం సమంజసం కాదన్నారు. ప్రైవేట్ వ్యక్తులతో అధికారులు లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకొని ఆలయభూమి అన్యాక్రాంతం కాలేదని మాట్లాడడం సరికాదని, ఈ విషయంలో హైకోర్టు ద్వారా అధికారులకు నోటీసులు పంపిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు మేలుకొని ఆలయభూమి అన్యాక్రాంతాన్ని అరికట్టాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళనలు చేబడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ కుంభం కుమార్, ఈవో వంశీ, వీహెచ్‌పీఎస్ ప్రబంధ అధ్యక్షులు కూరోజు సదానందచారి, ఉపాధ్యక్షుడు అందే వేణు, బజరంగ్‌దళ్ జిల్లా కో కన్వీనర్ అరవింద్, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



ఏబీవీపీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న విద్యార్థులు

కొడకండ్ల, జూలై 9: మండలకేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కన్వీనర్ సున్నపోజు విశ్వాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏబీవీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ, బీజేపీ నాయకులు కోటేశ్వర్, చంద్రయ్య, రంజిత్, సాయి, ఉత్తేజ్, అజయ్, సతీష్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న కొమ్మూరి

జనగామ రూరల్, జూలై 9: జనగామ మండలం అడవికేశవాపూర్‌కు చెందిన కమల్ల మల్లయ్య బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. చికిత్స కోసం పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా ఆధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి సీఎం సహాయనిధి ద్వారా రూ. రెండు లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించి మంగళవారం మల్లయ్య కుటుంబసభ్యులకు అందజేశారు.

పీహెచ్‌సీలో సమస్యలు పరిష్కరించాలి



రోగులతో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా నాయకులు

స్టేషన్ ఘన్ పూర్, జూలై 9: డివిజన్ కేంద్రంలోని పీహెచ్‌సీలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని సంబంధిత అధికారులు పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య, కార్యదర్శి ఎమ్డీ షబానా అన్నారు. మంగళవారం ఘన్‌పూర్ పీహెచ్‌సీలో వార్డులను వారు పరిశీలించి, ఆస్పత్రిలో సమస్యలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేరుకే 30 పడకల ఆస్పత్రి అని, కనీసం 15 బెడ్లు కూడ లేవని, తాగు నీరు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, ఆస్పత్రి భవనం పలు చోట్ల పెచ్చులూడి పడుతోందని, వైద్య పరికారాలు ఉన్నప్పటికీ సిబ్బంది వాటిని వినియోగించడం లేదని అన్నారు. కనీసం ఆస్పత్రిలో ప్రసవాలు చేసే పరిస్థితి లేకపోవడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు మేలుకొని ఆస్పత్రిలో సేవలు మెరుగుపరచాలని కోరారు. కార్యక్రమంలో దైద రాములమ్మ, విజయ, కొంతం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముత్తారంలో కాంగ్రెస్ సమావేశం

పాలకుర్తి, జూలై 9: గ్రామాల్లో సమస్యలను ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి దృష్టికి వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి అన్నారు.మంగళవారం వారు ముత్తారం గ్రామంలో కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముత్తారం నుంచి పాటిమీది తండాకు వెళ్లాలంటే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, కోమటి చెరువు నుంచి బ్రాహ్మణ గుట్టతండా వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, కుక్కల బెడద నివారించాలని, ఈ అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. సమావేశంలో ఎర్రబెల్లి రాఘవరావు, భూమ రంగయ్య, చిలువేరు కృష్ణమూర్తి, గాదె పాక భాస్కర్, కారుపోతుల శ్రీనివాస్, జలగం కుమార్, రమేష్ పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనులను పూర్తి చేయాలి

చిలుపూర్, జూలై 9: గౌరవెల్లి సాగునీటి ప్రాజెక్ట్ కాలువ నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి కృష్ణాజీగూడెంలో కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్ట్ వరద కాలువ నిర్మాణం కోసం భూసేకరణ చేసి కాలువ నిర్మాణ పనులను చేపట్టిందన్నారు. ఆ పనులు నేటికీ పూర్తి కాకపోవడంతో ప్రస్తుతం చెత్త చెదారం, పిచ్చి మొక్కలతో పూడుకుపోయిందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించి వెంటనే పూర్తి చేయించడంతో పాటు, సాగునీరందే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాదం పరమేశ్, పోలు సంపత్, గద్ద కుమార్, సాదం రాజు, భిక్షపతి, రామరాజు, మూడికె సాయిలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టుకున్న అధికారులు

జనగామ రూరల్. జూలై 9: జిల్లా కేంద్రంలోని కుర్మవాడలో సోమవారం అర్ధరాత్రి ఆలేరు కండిగడ్డా తండాకు చెందిన బానోత్ తిరుపతి, బానోత్ భద్రమ్మ రేషన్ బియ్యం కొనుగోలు చేస్తుండగా జనగామ ఎస్సై సృజన్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. 12 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు వాహనాన్ని మంగళవారం సివిల్ సప్లయీస్ డీటీ ఇట్టబోయిన శ్రీనివాస్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ బియ్యం తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

జఫర్‌గడ్, జూలై 9 : మండలంలోని కూనూరుకు చెందిన యాట కొమురమ్మ (71) అనే వృద్ధురాలు వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఎస్ఐ శీలం రవి యాదవ్, గ్రామస్థులు తెలిపిన ప్రకారం.. వరంగల్‌కు చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి ఈనెల 1వ తేదీన కూనూరుకు వచ్చి వీధుల్లో తిరుగుతూ రాళ్లు విసిరాడు. ఈ క్రమంలో తన ఇంటి ముందు పని చేసుకుంటున్న కొమురమ్మను ఇటుకతో తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన వృద్ధురాలిని అదే రోజున వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జఫర్‌గడ్, జూలై 9 : మండల కేంద్రానికి చెందిన ఈరబత్తిని కాంతం (59) అనే నేత కార్మికుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబీకులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. వారిలో అన్నెబోయిన భిక్షపతి, కుల్ల మోహన్‌రావు, తాటికాయల చిరంజీవి, మంచాల అనిల్, జ్యోతి యాకయ్య, ఇల్లందుల మొగిలి, కుల్ల రాజు, ఉల్లి శివరాజు, మామిడాల మధుబాబు, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీ నాయకుల పరామర్శ

చిలుపూర్, జూలై 9 : మండలంలోని రాజవరంలో అనారోగ్యంతో మృతిచెందిన పుల్ల వెంకటమ్మ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మారెపల్లి శ్యామ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ జిల్లా నాయకుడు మారెపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి వేర్వేరుగా పరామర్శించారు. ఆమె కుమారుడు మాజీ ఆదర్శరైతు పుల్లారెడ్డిని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మారెపల్లి కృష్ణమోహన్‌రెడ్డి, పాగాల భగవాన్‌రెడ్డి, నల్ల ఎల్లయ్య, ఎడ్ల మొగిలి, ఎడ్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జనగామ రూరల్, జూలై 9: రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం నాయకులు మంగళవారం జనగామ తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసిల్దార్ గుగులోత్ వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆధ్యక్షుడు రాపర్తి సోమయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ధరణి సమస్యలు పరిష్కరించాలని, రుణమాఫీ చేయాలని, రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

లీగల్ సెల్ కన్వీనర్‌గా రమేష్



స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 9: కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సీనియర్ న్యాయవాది, మండలంలోని ఛాగల్ గ్రామానికి చెందిన కనకం రమేష్‌ను టీపీసీసీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా నియమిస్తూ టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ అశోక్‌కుమార్‌గౌడ్‌కు, ఎంపీ కడియం కావ్యకు, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి, టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిరకు కృతజ్ఞతలు తెలిపారు.

కవి, గాయకులకు అవార్డులు



వెంకటేశం



సంజీవ

లింగాలఘణపురం జూలై 9: మండలంలోని వడ్డిచర్లకు చెందిన ప్రఖ్యాత కవి, గాయకుడు కానుగంటి వెంకటేశంతో పాటుగా మండల కేంద్రానికి చెందిన ప్రముఖ కళాకారుడు గట్టగల్ల సంజీవ తెలంగాణ గానకోకిల అవార్డులకు ఎంపికయ్యారు. ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ ఆధ్వర్యంలో ఏటా ప్రసిద్ధ కళాకారులను గుర్తించి తెలంగాణ గానకోకిల అవార్డులను అందజేస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 12న కరీంనగర్‌లో నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవానికి లింగాలఘణపురం మండలం నుంచి ఇద్దరు కళాకారులు హాజరుకానున్నారు.

దివ్యాంగుల సేవా సమితి మండల కమిటీ ఎన్నిక

పాలకుర్తి, .జూలై 9: దివ్యాంగుల సేవా సమితి మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షురాలు శివరాత్రి సుగుణ సమక్షంలో జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా మల్లంపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి యాకయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడుగా గాదరి యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా అరూరి యాదగిరి, కార్యదర్శిగా మల్లికాంబ, కోశాధికారిగా నారబోయిన యాకయ్య ఎన్నికైనట్లు సుగుణ తెలిపారు. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని అన్నారు.

డీఈవోకు వినతిపత్రం

జనగామ కల్చరల్, జూలై 9: స్థానిక సెయింట్ మేరీస్ పాఠశాల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేవైఎం నాయకులు డీఈవో కె.రాముకు మంగళవారం వినతిపత్రం అందించారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉల్లెంగుల రాజు మాట్లాడుతూ ఈ నెల 7న 9వ తరగతి విద్యార్థి పట్ల సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని, ఈ విషయంలో యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం అధికార ప్రతినిధి చింతకింది సంతోష్, తాండ్ర అభినయ్, పగిడిపల్లి కార్తీక్ పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోం..

జనగామ రూరల్: తమ పాఠశాల పట్ల తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని సెయింట్ మేరీస్ ప్రిన్సిపాల్ జైమోన్ థామస్, డైరెక్టర్ ఉదయ్ బాస్కర్ రెడ్డి అన్నారు. పాఠశాలలో మంగళవారం వారు మాట్లాడుతూ 9వ తరగతి విద్యార్థి జోగు అజయ్‌కుమార్ తల్లిదండ్రులకు ఒక గంట ఔటింగ్‌కు పర్మిషన్ ఇస్తే సాయంత్రం తీసుకొని వచ్చారని, పైగా మరో విద్యార్థితో మాట్లాడాలని అంటూ వార్డెన్ నరేశ్ పట్ల అసభ్యంగా ప్రవర్తించి యాజమాన్యాన్ని బూతులు తిట్టారని ఆరోపించారు. విషయం తెలుసుకోకుండా ఏబీవీపీ, బీజేవైఎం నాయకులు పాఠశాలలో ఫర్నీచర్, పూల కూండీలను ధ్వంసం చేశారని అన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

పాఠశాలకు ఎలక్ట్రికల్ బెల్ అందజేత

బచ్చన్నపేట, జూలై 9: బచ్చన్నపేట ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, ఉపాధ్యాయుడైన గొట్టె కనకయ్య మంగళవారం తాను చదువుకున్న పాఠశాల కోసం రూ. 10 వేల విలువ చేసే ఎలక్ట్రికల్ బెల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కనకయ్యను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, రాంచంద్రం, పృథ్వీరాజ్, యాదగిరి, బాల్‌రాజు, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల నిరసన



వాననీటిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్, జూలై 9: జిల్లా కేంద్రంలోని బాణాపురంలో చిన్న వర్షాలకు రోడ్లు జలమయం అవుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం నాయకులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ మాట్లాడుతూ బాణాపురంలో చిన్న వర్షాలకు రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయని మున్సిపల్ అధికారులు, మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో కళ్యాణం లింగం, వసంత, పద్మ, రజిత, గౌసీయా, తదితరులు పాల్గొన్నారు.


ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి



కోర్టుకు హాజరైన జనగామ జిల్లా ఉద్యమకారులు

జనగామ రూరల్, జూలై 9: జనగామ జిల్లా సాధన ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఉద్యమకారులు మంతెన మణి కుమార్, మంగళంపల్లి రాజు ప్రభుత్వాన్ని కోరారు. జనగామ జిల్లా సాధన ఉద్యమ కేసులో భాగంగా మంగళవారం జిల్లా ఉద్యమకారులు పిట్టల సురేష్, తీగల సిద్దుగౌడ్, ఎండీ మాజీద్ ,సతీష్ కోర్టులో హాజరయ్యారు.

ఎస్సై మృతికి కారకులను శిక్షించాలి



కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నాయకులు

జనగామ రూరల్, జూలై 9: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతికి కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్ నాయకులు మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు తుటి దేవదానం మాట్లాడుతూ సీఐ జితేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, ఎస్సై కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఆయన భార్యకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.